ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్ Evening 6PM
సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 50 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు : 3 + https:www.prajarepublic.com + వెల - 1/-
మంగళవారం 24 సెప్టెంబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

వైకాపా నేతలూ.. సనాతన ధర్మం జోలికి రావొద్దు: పవన్

వైకాపా పాలనలో ఆలయాల్లో తప్పు జరిగిందని చెబితే అపహాస్యం చేసేవారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు.

విజయవాడ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 24: వైకాపా పాలనలో ఆలయాల్లో తప్పు జరిగిందని చెబితే అపహాస్యం చేసేవారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అపవిత్రం జరిగినప్పుడు బాధ్యత ఉన్న వ్యక్తులు సమాధానం చెప్పాలన్నారు. తిరుమల లడ్డూ కల్తీ ఘటన నేపథ్యంలో పవన్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. దీనిలో భాగంగా విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గగుడిలో ఆలయ మెట్లను పవన్ శుభ్రం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైకాపా నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పొన్నవోలు వ్యాఖ్యలు బాధాకరం

"నాపై విమర్శలు కాదు.. అపవిత్రం జరిగిందని తెలిసినప్పుడు మీ బాధ్యతేంటి? లడ్డూ ప్రసాదంలో అపవిత్రం జరిగిందంటే చాలా ఆవేదన కలుగుతోంది. ఇప్పటికీ వైకాపా నేతలు బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు. సున్నిత అంశాలపై ఆ పార్టీ నేత పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వ్యాఖ్యలు బాధాకరం. ఇలాంటి పరిస్థితుల్లో పొగరుగా మాట్లాడితే ఊరుకునేది లేదు. విమర్శించే వైకాపా నేతలకు చెబుతున్నా.. సనాతన ధర్మం జోలికి రావొద్దు. తప్పు జరిగితే ఒప్పుకోండి.. లేకపోతే సంబంధం లేదని చెప్పండి.

ప్రకాశ్ రాజ్.. విషయం తెలుసుకుని మాట్లాడండి..

సున్నితాంశాలపై నటుడు ప్రకాశ్ రాజ్ విషయం తెలుసుకుని మాట్లాడాలి. ఆయనతో పాటు అందరికీ చెబుతున్నా.. విమర్శలకు ముందు ఏం జరిగిందో తెలుసుకోండి. సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదు" అని పవన్ వ్యాఖ్యానించారు.

ధర్మారెడ్డి కనిపించట్లేదు..

"తిరుమలను ఇష్టారాజ్యంగా మార్చేశారు. మాజీ ఈవో ధర్మారెడ్డి ఎక్కడో కనిపించట్లేదు. విచారణకు రావాలంటే సుబ్బారెడ్డికి రికార్డులు ఇవ్వాలట. సనాతన ధర్మంపై పోరాటం చేస్తే నన్నెవరూ ఆపలేరు. ఈ నేల అన్ని మతాలను గౌరవిస్తుంది" అని పవన్ అన్నారు.

ప్రాయశ్చిత్త దీక్ష.. దుర్గ గుడి మెట్లు శుభ్రం చేసిన పవన్

తిరుమల లడ్డూ కల్తీ ఘటన నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే.

విజయవాడ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 24: తిరుమల లడ్డూ కల్తీ ఘటన నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గ ఆలయంలో ఆయన శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆలయ అధికారులు పవన్కు స్వాగతం పలికారు. అనంతరం ఆలయం వద్ద మెట్లను ఆయన శుభ్రం చేశారు. ఆ తర్వాత మెట్లకు పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దుర్గమ్మను పవన్ దర్శించుకున్నారు. ఎంపీలు కేశినేని శివనాథ్ (చిన్ని), బాలశౌరి, ఎమ్మెల్సీ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ప్రాయశ్చిత్త దీక్ష విరమించేందుకు పవన్ అక్టోబరు 1న తిరుపతి నుంచి అలిపిరి మెట్ల మార్గంలో తిరుమలకు నడుచుకుంటూ వెళ్లనున్నారు. 2న ఉదయం శ్రీవారిని దర్శించుకున్న అనంతరం దీక్ష విరమించనున్నారు.

జగన్.. తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వాల్సిన బాధ్యత మీకు లేదా?: చంద్రబాబు

గత ప్రభుత్వంలో దేవాలయాల్లో జరిగిన ఘటనల పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తించి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.

అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 24: గత ప్రభుత్వంలో దేవాలయాల్లో జరిగిన ఘటనల పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తించి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. వైకాపా అధ్యక్షుడు జగన్ దేవుడిని దర్శించుకోవచ్చని.. కానీ ఆయనకు వేంకటేశ్వరస్వామి పై నమ్మకం ఉందా? లేదా? అనేది ముఖ్యమన్నారు. తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వాల్సిన బాధ్యత జగన్కు లేదా? అని నిలదీశారు. ఈ మేరకు 'ఎక్స్'లో చంద్రబాబు పోస్ట్ చేశారు. "నమ్మకం ఉంటే అన్యమతస్థులు సంప్రదాయం ప్రకారం తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వాలి. అలా డిక్లరేషన్ ఇవ్వాల్సిన బాధ్యత జగన్కు లేదా? సంప్రదాయాన్ని గౌరవించకపోతే తిరుమల ఎందుకు వెళ్లాలి? మీకు అధికారం ఇచ్చింది సంప్రదాయాలకు విరుద్ధంగా పని చేయడానికి కాదు. అది అడిగితే బూతులు తిట్టారు. వైకాపా హయాంలో జరిగిన ఘటనల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారు. రథం కాలిపోతే.. ఏముందీ తేనెటీగలు వచ్చాయి అన్నారు. తిరుమల పోటులో అగ్ని ప్రమాదం జరిగితే ఏమవుతుందని వ్యాఖ్యానించారు. ఇలా నిర్లక్ష్యంగా ప్రవర్తించి మనోభావాలు దెబ్బతీశారు. అందుకే భగవంతుడికి అందరం క్షమాపణ చెప్పాలి. ఇక ఆయనే చూసుకుంటాడు. అపచారం చేసి ఆ అబద్ధాలను నిజాలుగా చేయాలని చూడటం స్వామి ద్రోహం" అని చంద్రబాబు పేర్కొన్నారు.

దులీప్ ట్రోఫీలో భారీగా క్రికెట్ బెట్టింగ్.. అంతరాష్ట్ర ముఠా అరెస్ట్

దులీప్ ట్రోఫీలో భారీ స్థాయిలో క్రికెట్ బెట్టింగ్ జరిగిందని, అంతరాష్ట్ర క్రికెట్ బెట్టింగ్ ముఠాను రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నామని అనంతపురం గ్రామీణ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు.

అనంతపురం, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 24: దులీప్ ట్రోఫీలో భారీ స్థాయిలో క్రికెట్ బెట్టింగ్ జరిగిందని, అంతరాష్ట్ర బెట్టింగ్ ముఠాను రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నామని అనంతపురం గ్రామీణ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. కేసు వివరాలను ఆయన మీడియాకు వివరించారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న 19 మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వారి నుంచి రూ.8.60లక్షలు, 19 సెల్ఫోన్లు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుల్లో కర్ణాటకకు చెందిన 12 మంది, హరియాణాకు చెందిన ఏడుగురు ఉన్నట్లు చెప్పారు. ఈ ముఠా సభ్యులు దేశంలో ఎక్కడ క్రికెట్ మ్యాచ్ జరిగినా లైవ్ మ్యాచ్లు చూస్తూ బెట్టింగ్ నిర్వహిస్తారని, మైదానంలో క్రికెట్ చూస్తూ మొబైల్ అప్లికేషన్ ద్వారా ప్రతి ఓవర్, బాల్కు బెట్టింగ్ పెడతారని తెలిపారు. దులీప్ క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో అనంతపురం పోలీసులు తొలిరోజు నుంచే స్టేడియంపై నిఘా పెట్టారు. యాప్లో క్రికెట్ బెట్టింగ్ చేస్తుండగా ఈ ముఠాను పోలీసులు పట్టుకున్నారు.

వారు 'డంకీ'లుగా ఎందుకు మారుతున్నారు? :రాహుల్ గాంధీ

హరియాణాలో అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు.

చండీగఢ్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 24: భారతీయ జనతా పార్టీ (భాజపా)పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. దేశంలోని యువతకు భాజపా ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించట్లేదని మండిపడ్డారు. అందువల్లే హరియాణాలోని ఎక్కువ శాతం యువత 'డంకీ'లుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని యువతకు భాజపా ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించకపోవడం వల్ల వేరే దారిలేక వారు పని కోసం విదేశాలకు వెళ్తున్నారని పేర్కొన్నారు. అక్కడ వారు సరైన తిండి, నివాసం లేకపోవడంతో పాటు, చిత్రహింసలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను అమెరికా పర్యటనకు వెళ్లిన సమయంలో తమ సమస్యలు చెప్పుకొని బాధ పడ్డారని తెలిపారు. హరియాణా నుంచి విదేశాలకు వెళ్లిన వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పేర్కొంటూ వారు మాట్లాడిన వీడియోను షేర్ చేశారు. వీడియోలో కొందరు యువత మాట్లాడుతూ తమ సొంత రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఉండటం వల్ల తాము ఉపాధి కోసం యూఎస్ వెళ్లవలసి వచ్చిందని.. అక్కడ తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. రాహుల్ వీడియోను షేర్ చేస్తూ 'హరియాణా ప్రజలు 'డంకీ'లుగా ఎందుకు మారుతున్నారు?' అంటూ ప్రశ్నించారు. భాజపా చేస్తున్న తప్పునకు యువత తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ శిక్ష అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. దీని వల్ల వృద్ధాప్యంలో ఉన్న వారి తల్లిదండ్రులను చూసుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయిందని అన్నారు. హరియాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే యువత తమ కుటుంబాలకు దూరంగా ఉండే పరిస్థితి ఏర్పడకుండా ఇక్కడే ఉద్యోగావకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఉద్యోగావకాశాలు లేకపోవడంతో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలి వెళ్లేవారిని 'డంకీ'లుగా పిలుస్తారు. అక్టోబరు 5న హరియాణా ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార భాజపా నుంచి అధికారాన్ని తిరిగి చేజిక్కించుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు చేస్తోంది. రైతుల సమస్యలు, నిరుద్యోగాన్ని అస్త్రాలుగా చేసుకొని పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారాలు నిర్వహిస్తోంది.

జానీ మాస్టర్ పోలీస్ కస్టడీపై తీర్పు బుధవారానికి వాయిదా

జానీ మాస్టర్ కస్టడీ పిటిషన్పై రంగారెడ్డి కోర్టులో వాదనలు పూర్తయ్యాయి.

హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 24: జానీ మాస్టర్ కస్టడీ పిటిషన్పై రంగారెడ్డి కోర్టులో వాదనలు పూర్తయ్యాయి. 5 రోజుల కస్టడీ కోసం నార్సింగి పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. తీర్పును రేపటికి వాయిదా వేసింది. జానీ మాస్టర్ బెయిల్ పిటిషన్పై కూడా బుధవారం కోర్టులో వాదనలు జరగనున్నాయి. ప్రస్తుతం జానీ మాస్టర్ చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. సహాయ కొరియోగ్రాఫర్ పై లైంగిక వేధింపుల కేసులో ఈ నెల 19న అతన్ని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

కాళేశ్వరం డిజైన్లు, డ్రాయింగ్లు ఎవరు తయారు చేశారు? :జస్టిస్ పీసీ ఘోష్

కాళేశ్వరంపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట ఇంజినీర్లు, మాజీ ఇంజినీర్లు మంగళవారం విచారణకు హాజరయ్యారు.



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 24: కాళేశ్వరంపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట ఇంజినీర్లు, మాజీ ఇంజినీర్లు మంగళవారం విచారణకు హాజరయ్యారు. ఉన్నతాధికారులకు తెలియకుండా ఈఈ తిరుపతిరావు ఏజెన్సీలకు రూ.1,600 కోట్ల బ్యాంకు గ్యారంటీలు ఇచ్చినట్టు ఇంజినీర్లు తెలిపారు. బ్యాంకు గ్యారెంటీలను ఏజెన్సీలకు ఇచ్చే ముందు అండర్ టేకింగ్ ఏజెన్సీల నుంచి ఏమైనా తీసుకున్నారా అని కమిషన్ ఇంజినీర్లను ప్రశ్నించింది. ఈఎన్సీ కార్యాలయంలో జరిగిన సమావేశం మినిట్స్ అనుసరించకుండానే విడుదల చేసినట్టు వారు తెలిపారు. ఆనకట్టల వద్ద డ్యామేజ్కు గల కారణాలను కమిషన్ అడిగి తెలుసుకుంది. అనుకున్నదానికంటే ఎక్కువ వరద రావడం వల్లే సీసీ బ్లాక్ లు దెబ్బతిన్నట్టు ఇంజినీర్లు తెలిపారు. 2022 జులైలో వచ్చిన భారీ వరదల కారణంగా సీసీ బ్లాక్ లు దెబ్బతిన్నట్టు వెల్లడించారు. డ్యామేజి జరిగిన వెంటనే ఏజెన్సీలకు లేఖలు రాసినట్లు కమిషన్కు వివరించారు. డిజైన్లు, డ్రాయింగ్లు ఎవరు తయారు చేశారని కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్ ప్రశ్నించగా... వ్యాప్కోస్ సంస్థ తయారు చేసిందని సమాధానమిచ్చారు. సీడీఓ సీఈ అనుమతితో అమలు చేసినట్టు తెలిపారు. నిర్మాణానికి ముందు సైట్లలో ఏమైనా పరీక్షలు నిర్వహించారా? అని కమిషన్ ప్రశ్నించగా.. ఎన్ఐటీ వరంగల్ ఆధ్వర్యంలో పరీక్షలు జరిగినట్టు ఇంజినీర్లు వివరించారు.

పాఠశాల వద్ద ఘర్షణ.. సీఐ, ఎస్ఐలకి గాయాలు

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జీవన్దాన్ పాఠశాల వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది.

కామారెడ్డి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 24: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జీవన్దాన్ పాఠశాల వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన టీచర్ను శిక్షించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు- విద్యార్థుల తల్లిదండ్రులు, ఆందోళనకారుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ రాజారామ్కు గాయాలయ్యాయి. ఆందోళనకారులను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేశారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

రియల్ టైమ్ గవర్నెన్స్.. పౌర సేవలపై ప్రత్యేక ప్రాజెక్ట్ :సీఎం చంద్రబాబు

రియల్ టైమ్‌లో సమస్యలపై ప్రభుత్వం స్పందించే విధానం అందుబాటులోకి వస్తే ప్రజలకు సత్వర సాయం అందుతుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.

అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 24: రియల్ టైమ్‌లో సమస్యలపై ప్రభుత్వం స్పందించే విధానం అందుబాటులోకి వస్తే ప్రజలకు సత్వర సాయం అందుతుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) ద్వారా పౌర సేవలు, ప్రభుత్వ కార్యక్రమాలపై 100 రోజుల్లో ప్రత్యేక ప్రాజెక్ట్ సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సచివాలయంలోని మొదటి బ్లాక్ లో ఉన్న సెంటర్ను సీఎం చంద్రబాబు సందర్శించారు. అనంతరం ఆర్టీజీ సెంటర్లోనే సీఎస్, డీజీపీ సహా ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. పౌరసేవలను సులభతరం చేయడం, పాలనలో వేగం పెంచడంపై సమావేశంలో చర్చించారు. ప్రజలకు సంబంధించిన మాస్టర్ డేటాను అన్ని శాఖలు యాక్సిస్ చేసుకొని సత్వర సేవలను అందించే విధంగా ప్రణాళిక రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఆధార్, వ్యాక్సినేషన్ డేటా, స్కూల్ అడ్మిషన్, రేషన్కార్డుల్లో పేర్ల నమోదు, మ్యారేజ్ సర్టిఫికెట్, ఇతర సర్టిఫికెట్లకు సంబంధించి కార్యక్రమాలు ప్రజలకు ఆటోమెటిక్గా అందే అంశంపై చర్చించారు. పారిశుద్ధ్యం, ట్రాఫిక్, ప్రమాదాలు, నేరాలు, రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులు, పంట కాలువల నిర్వహణ, అగ్రికల్చర్, వరదలు, భారీ వర్షాలు, విపత్తులు, డిజాస్టర్ మేనేజ్మెంట్ వంటి అంశాల్లో రియల్టైమ్ గవర్నెన్స్ ద్వారా తీసుకోదగిన చర్యలపై అధికారులతో సీఎం చర్చలు జరిపారు. సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లు వంటి వాటి ద్వారా డేటా విశ్లేషణ, ప్రభుత్వ సేవల అందజేత, నాణ్యతపై సమావేశంలో చర్చించారు

మర్పల్లిలో భారాస, కాంగ్రెస్ కార్యకర్తల బాహాబాహీ

వికారాబాద్ నియోజకవర్గ పరిధిలోని మర్పల్లిలో మంగళవారం భారాస, కాంగ్రెస్ కార్యకర్తలు బాహాబాహీకి దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది.

మర్పల్లి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 24: వికారాబాద్ నియోజకవర్గ పరిధిలోని మర్పల్లిలో మంగళవారం భారాస, కాంగ్రెస్ కార్యకర్తలు బాహాబాహీకి దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. భారాస కార్యకర్తపై అక్రమ కేసు పెట్టారని ఆరోపిస్తూ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పార్టీ శ్రేణులతో కలిసి మర్పల్లి పోలీస్ స్టేషన్కు వెళ్లి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా స్టేషన్ వద్దకు తరలివచ్చారు. ఆనంద్ డౌన్.. డౌన్, మర్పల్లి నుంచి వెళ్లిపోవాలంటూ నినాదాలు చేశారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టడంతో గొడవ సద్దుమణిగింది. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆగడాలను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామని ఈ సందర్భంగా భారాస నాయకులు తెలిపారు.

అవినాశ్, రఘురామ్ విచారణకు సహకరించట్లేదు :మంగళగిరి పోలీసులు

తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో వైకాపా నేతలు దేవినేని అవినాశ్, తలశిల రఘురామ్లు విచారణకు సహకరించడం లేదని మంగళగిరి పోలీసులు తెలిపారు.

మంగళగిరి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 24: తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో వైకాపా నేతలు దేవినేని అవినాశ్, తలశిల రఘురామ్లు విచారణకు సహకరించడం లేదని మంగళగిరి పోలీసులు తెలిపారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్తామని సీఐ శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. మంగళవారం ఈ ఇద్దరు నేతలను పోలీసులు విచారణకు పిలిచారు. ఉదయం 10 గంటలకు తలశిల రఘురామ్ను విచారించిన పోలీసులు.. గంట తర్వాత వదిలిపెట్టారు. దేవినేని అవినాశ్ను మధ్యాహ్నం 12 గంటల నుంచి 1.30గంటల వరకు విచారించారు. రఘురామ్ను 7, అవినాశ్ను 11 ప్రశ్నలు అడిగారు. అన్నింటికీ తమకు తెలియదు, గుర్తులేదు, మర్చిపోయా-యని వారు సమాధానాలు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. వాళ్లు వినియోగించిన సెల్ఫోన్లు ఇవ్వాలని అడగ్గా కోర్టు అనుమతి తీసుకొని ఇస్తామని రాఘురామ్, అవినాశ్ చెప్పినట్లు సమాచారం.

మరికాసేపట్లో హైదరాబాద్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం

మరికాసేపట్లో హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరించింది.

హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 24: మరికాసేపట్లో హైదరాబాద్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరించింది. సుచిత్ర, గుండ్లపోచంపల్లి, బహదూర్పల్లి, సూరారం, కొంపల్లి, చింతల్, కండ్లకోయ, కృష్ణాపూర్, దుండిగల్, డబిల్పూర్ తదితర ప్రాంతాల్లో ఇప్పటికే వర్షం కురుస్తోంది. కరీంనగర్, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి జిల్లాల్లో కాసేపట్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశముందని తెలిపింది.

రాష్ట్రవ్యాప్తంగా నాలుగు రోజులు భారీ వర్షాలు

రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బుధవారం గంటకు 40 నుంచి 50 కి.మీ, గురువారం 30 నుంచి 40 కి.మీ వేగంతో అక్కడక్కడ గాలులు వీచే అవకాశం ఉందని ప్రకటించింది. మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉత్తరాంధ్ర- దక్షిణ ఒడిశా తీరం వద్ద పశ్చిమ మధ్య బంగాళాఖాతం దాని పరిసర వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని పేర్కొంది.

విశాఖ స్టీల్ప్లాంట్లో అగ్నిప్రమాదం

విశాఖ స్టీల్ప్లాంట్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఎస్ఎంఎస్-1లో మంటలు చెలరేగాయి.

విశాఖ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 24: విశాఖ స్టీల్ ప్లాంట్లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఎస్ఎంఎస్-1లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో సీనియర్ మేనేజర్ మల్లేశ్వరరావుకు తీవ్రగాయాలయ్యాయి. ఆయనను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఎల్పీబీ స్టీల్ ల్యాడిల్ బ్లాస్ట్ అవ్వడంతో ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

లైవ్ ఫిష్ లారీ బోల్తా.. చేపల కోసం ఎగబడిన ప్రజలు

మహబూబాబాద్ జిల్లా మరిపెడలో చేపల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఖమ్మం నుంచి వరంగల్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

మరిపెడ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 24: మహబూబాబాద్ జిల్లా మరిపెడలో చేపల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఖమ్మం నుంచి వరంగల్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. లారీ బోల్తాతో చేపలన్నీ రోడ్డుపై పడిపోయాయి. బతికున్న చేపల (లైవ్ ఫిష్) కోసం ప్రజలు ఎగబడ్డారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపు చేశారు.

ఓటుకు నోటు కేసు.. విచారణకు సీఎం రేవంత్ హాజరుకావాలని కోర్టు ఆదేశం

నాంపల్లి కోర్టులో ఓటుకు నోటు కేసుపై విచారణ జరిగింది.

ఈ కేసులో విచారణకు హాజరుకావాలని సీఎం రేవంత్ రెడ్డిని న్యాయస్థానం ఆదేశించింది.

హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 24: నాంపల్లి కోర్టులో ఓటుకు నోటు కేసుపై విచారణ జరిగింది. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని సీఎం రేవంత్రెడ్డిని న్యాయస్థానం ఆదేశించింది. అక్టోబర్ 16న విచారణకు రావాలని సూచించింది. నేడు జరిగిన విచారణకు మత్తయ్య సహా మిగిలిన నిందితులు గైర్హాజరయ్యారు. విచారణకు రాకపోవడంపై కోర్టు అసహనం వ్యక్తం చేసింది.

నేను అవినీతిపరుడిని కాదని ప్రత్యర్థులూ నమ్ముతారు: కేజ్రీవాల్

దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ భాజపాపై తీవ్ర ఆరోపణలు చేశారు. తనను ఓ దొంగగా చిత్రీకరించేందుకు ఆ పార్టీ ప్రయత్నించిందని అన్నారు.

చండీగఢ్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 24: తనను ఒక దొంగగా చిత్రీకరించేందుకు భాజపా భావించిందని ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. అందుకే తనను అరెస్టు చేయించిందని అన్నారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రానియా నియోజకవర్గంలో నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్న కేజ్రీవాల్ ఈ వ్యాఖ్యలు చేశారు.

నా తప్పేంటి..?

"అసలు నేను చేసిన తప్పేంటి..? ఢిల్లీకి పదేళ్లు సీఎంగా ఉండడమేనా. పేదల పిల్లలకు మంచి విద్యను ఏర్పాటు చేశా. గతంలో 7 నుంచి 8 గంటలు కరెంటు కోతలు ఉండేవి. కానీ, ఇప్పుడు దిల్లీ, పంజాబ్లో ఉచిత కరెంట్ను అందిస్తున్నాం. అందుకోసం రూ.3 వేల కోట్లు ఖర్చు చేశాం. ఆప్ ప్రభుత్వం వృద్ధులకు ఉచితంగా 'తీర్థ యాత్ర' అందిస్తోంది. అదేనా నేను చేసిన తప్పు..? అవినీతిపర-ులెవరూ ఇలా చేయరు" అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. "ఒకవేళ నేను అవినీతిపరుడినే అయితే.. ఆ డబ్బంతా నా జేబులోకే వెళ్లేది. అప్పుడు ఇంత అభివృద్ధి కనిపించేది కాదు. నన్ను ఓ దొంగగా చిత్రీకరించాలని భాజపా భావిస్తోంది. అందుకే నన్ను జైల్లో పెట్టింది. నా ప్రతిష్టను దెబ్బతీయాలని ప్రయత్నిస్తోంది. నేను అవినీతికి పాల్పడలేదని ప్రత్యర్థులూ విశ్వసిస్తారు. జైల్లో ఉన్నప్పుడు నన్ను మానసికంగా, శారీరకంగా దెబ్బతీయాలని చూశ-ారు. నాకు ఇన్సులిన్ ఇవ్వకుండా నిలిపివేశారు. నాడు వారు నన్ను ఏం చేయాలనుకున్నారో అర్థం కాలేదు" అని కేజ్రీవాల్ భాజపాపై తీవ్ర ఆరోపణలు చేశారు.

అధికారం కోసం ఆరాటపడను..

ప్రస్తుతం ప్యూన్ ఉద్యోగాన్ని కూడా ఎవరు వదలడం లేదని.. కానీ, తాను మాత్రం ఢిల్లీ సీఎం పదవికి రాజీనామా చేశానని కేజ్రీవాల్ పేర్కొన్నారు. తాను అధికారం కోసం ఆరాట పడే వ్యక్తిని కాదని అన్నారు. కాగా.. బెయిల్ పై విడుదలైన కేజీవాల్ సీఎం పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత తాత్కాలిక సీఎంగా మంత్రి ఆతిశీ పేరును ఆప్ ప్రకటించింది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఆతిశీ.. పక్కన కుర్చీని ఖాళీగా ఉంచి, ఆమె వేరే సీట్లో కూర్చొని బాధ్యతలు చేపట్టారు.

ఏపీలో కొత్త మద్యం షాపుల నోటిఫికేషన్కు రంగం సిద్ధం

ఆంధ్రప్రదేశ్లో కొత్త మద్యం షాపుల నోటిఫికేషన్ విడుదలకు ఎక్సైజ్ శాఖ సిద్ధమవుతోంది.

అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 24: ఆంధ్రప్రదేశ్లో కొత్త మద్యం షాపుల నోటిఫికేషన్ విడుదలకు ఎక్సైజ్ శాఖ సిద్ధమవుతోంది. రెండు.. మూడు రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేసే అవకాశముంది. రాష్ట్రంలో మద్యం దుకాణాలను ప్రభుత్వమే నడిపేలా గత ప్రభుత్వం చట్టం చేసింది. ఆ చట్టాన్ని సవరించి ఆర్డినెన్స్ తెచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆర్డినెన్స్ ఆమోదం కోసం సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ వద్దకు పంపనుంది. రేపటిలోగా గవర్నర్ ఆమోదం తెలిపే అవకాశముంది. రాష్ట్రంలో మొత్తం 3,736 మద్యం షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఇందులో 34 షాపులు కల్లుగీత వృత్తి దారులకు కేటాయించనున్నారు. రిజర్వేషన్ల కోటాలోని షాపులను ఎక్కడెక్కడ కేటాయించాలన్న అంశంపై అబ్కారీశాఖ కసరత్తు చేస్తోంది. కల్లుగీత వృత్తి కులాల జనాభా ఏయే జిల్లాల్లో ఏ మేరకు ఉన్నారనే అంశంపై ఆరా తీస్తున్నారు. కల్లుగీత వృత్తి కులాల జనాభా ప్రాతిపదికనే మద్యం షాపులను ఎక్సైజ్ శాఖ రిజర్వు చేయనుంది.

వివేకా హత్య కేసు.. శివశంకర్ రెడ్డి బెయిల్ రద్దు చేయాలని సునీత పిటిషన్

మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో ఆయన కుమార్తె సునీత పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది.

దిల్లీ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 24: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో ఆయన కుమార్తె సునీత పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో శివశంకర్రెడ్డి బెయిల్ రద్దు చేయాలని ఆమె పిటిషన్ వేశ-ారు. మిగిలిన నిందితులపై దాఖలైన పిటిషన్లనీ కలిపి విచారించాలని ఆమె తరపు న్యాయవాది కోరారు. పిటిషన్లన్నీ కలిపి నవంబర్ 5న ఒకేసారి విచారణ చేపట్టాలని పేర్కొన్నారు. వీటన్నింటికీ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం అంగీకారం తెలిపింది.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్

పట్టణంలో క్లీనింగ్‌పై మున్సిపాల్టీ చీటింగ్

చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1902: ఇరానీ మతనాయకుడు, పండితుడు ఆయతొల్లాహ్ ఖొమైనీ జననం (మ. 1989).
- 1922: తెలుగు నాటక రంగ ప్రముఖులు,సినిమా నటులు ధూళిపాళ సీతారామశాస్త్రి జననం (మ. 2007).
- 1923: ఆంధ్ర కమ్యూనిస్ట్ ఉద్యమ నేతలలో ప్రముఖుడు కొరటాల సత్యనారాయణ జననం (మ. 2006).
- 1931: భారత పార్లమెంటు సభ్యురాలు, గాయని మోతే వేదకుమారి జననం.
- 1932: భారత్‌లో అణగారిన వర్గాల కొరకు ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చెయ్యాలనే ప్రతిపాదనపై పూనా ఒప్పందం కుదిరింది.
- 1950: భారత మాజీ క్రికెట్ క్రీడాకారుడు మోహిందర్ అమర్‌నాథ్ జననం.
- 1968: నటి, జంతు సంక్షేమ కార్యకర్త, బ్లూక్రాస్ హైదరాబాద్ కన్వీనర్ అక్కినేని అమల జననం.
- 1998: న్యాయవాది, రాడికల్ హ్యూమనిస్ట్, హేతువాది మల్లాది వెంకట రామమూర్తి మరణం (జ. 1918).

ఆయతొల్లాహ్ ఖొమైనీ

సీతారామశాస్త్రి

సత్యనారాయణ

మోతే వేదకుమారి

పూనా ఒప్పందం

మోహిందర్ అమర్‌నాథ్

అక్కినేని అమల

మేల్కొనకపోతే ప్రమాదమే కట్టడికి కదలని పుర సిబ్బంది

దోమలకు పుట్టినిల్లుగా నంద్యాల మున్సిపాల్టీ

చినుకు రాలింది.. 'ఖాళీ' స్థలాలు.. గుంతల్లో నిలిచిన నీటిలో దోమ పుట్టింది.. పుర సిబ్బంది మేల్కొనకపోతే జనం రోగాలబారిన పడటం ఖాయం.

వర్షాకాలంలో డెంగీ, టైఫాడ్ కేసులు వెలుగు చూస్తున్నాయి. నగరం, పట్టణాల్లో అపరిశుభ్రత వెంటాడుతోంది. ఏటా పన్నుల రూపేణా ఆదాయం పొందుతున్న పురపాలికలు ఆ స్థాయిలో ప్రజారోగ్యంపై దృష్టి సారించడం లేదు. వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయినా.. తొలగించే పరిస్థితి లేదు. జనం జ్వరాల బారిన పడుతున్నా క్లీనింగ్‌పై దృష్టి పెట్టకుండా మున్సిపాల్టీ చీటింగ్ చేస్తున్నదని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. దోమలకు పుట్టినిల్లుగా మారి పట్టణ ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్న మున్సిపాల్టీలో పట్టించుకునేవారు కరవయ్యారు. మున్సిపాల్టీ పుర యంత్రాంగం మేల్కొనకపోతే జనాలకు రోగాల ముప్పు తప్పేలా లేదనేది స్పష్టమవుతోంది.

పట్టించుకోని ప్రజారోగ్య వ్యవస్థ

పురపాలికల్లో ప్రజారోగ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కర్నూలు నగరపాలక సంస్థలో ఏటా రూ. 50 లక్షలు, నంద్యాలలో రూ. 10-15 లక్షలు, ఆదోనిలో రూ. 5-10 లక్షల వరకు దోమల నివారణకు ప్రత్యేకంగా ఖర్చు చేస్తున్నారు. డోన్, ఆత్మకూరు, నందికొట్కూరు, ఆళ్లగడ్డ, గూడూరు తదితర పురపాలికల్లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఇక్కడా ఒక్కో పురపాలికల్లో ఏటా రూ. 1-2 లక్షలు ఖర్చు చేస్తున్నా.. కేసుల తీవ్రత ఆగడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి వర్ణనాతీతం. క్షేత్ర-స్థాయిలో మాత్రం వాటి ఫలితాలు కనిపించడం లేదు. తొమ్మిది పురపాలికల్లో ఫాగింగ్ యంత్రాలు 20-25, పిచికారీ పరికరాలు 350 వరకు ఉన్నాయి. వీటికి పని చెప్పక.... చాలా వాటిని మూలన పడేశారు.

చెత్త ఉన్న ప్రదేశం



మాటు వేసి ప్రాణాలు కాజేస్తున్న డెంగీ

ఉమ్మడి జిల్లాలోని పురపాలక సంఘాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో 2024 ఏడాది జనవరి నుంచి ఆగష్టు నెలవరకు మొత్తం 192 డెంగీ కేసులు నమోదయ్యాయి. అపరిశుభ్ర వాతావరణంతో ప్రజలలో అవగాహన లేమితో డెంగ్యూ వ్యాధి మాటు వేసి ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటుంది. కర్నూలు జిల్లాలో 168, నంద్యాల జిల్లాలో 44 కేసులు వచ్చాయి. మలేరియా కేసులు కర్నూలు జిల్లాలో రెండు వెలుగు చూశాయి... ఈ వర్షాకాలంలో పరిస్థితి తలచుకుంటే ఆందోళన కలిగిస్తోంది.

కానరాని ప్రత్యేక కార్యక్రమాలు

2014-19 మధ్య కాలంలో 'దోమలపై దండయాత్ర' పేరుతో నివారణ చర్యలు చేపట్టేవి. ఇవి ప్రజలను ఎంతో ఆలోచింపజేసేవి. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించేవారు. దోమలు పుట్టే ప్రాంతాలను గుర్తించి.. నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకునేవారు. ఇక వార్డుల్లో నీటి తొట్టెలు, పాత సామగ్రి, అపరిశుభ్రత, ట్యాంకులను తెరిచి ఉంచడం, టెంకాయ చిప్పలు, టైర్లలో నీరు నిలిచి ఉండటం తదితరాలతో వచ్చే అనర్థాలను జనాలకు వివరించే వారు. వారిలో చైతన్యపర్చే కార్యక్రమాలు చేపట్టేవారు. వైకాపా ప్రభుత్వంలో ఇలాంటివి కనిపించలేదు. కనీసం క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉంది..? కేసులు వచ్చిన చోట ఏం చేయాలి? భవిష్యత్తు కార్యచరణ ఏమిటి...? అనే ఆలోచన లేకపోయింది.


కాలువల పూడికలను తీసిన అక్కడే పడవేసిన చెత్త చెదారం

నిధులు పక్కదారి

దోమల నివారణ పేరుతో నిధులు పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారు. కంటికి కనిపించే లెక్కలు కావు.. చేసిన పనులకు లెక్కలు వేయలేని పరిస్థితి. దీంతో ఈ విభాగంలో నిధులు పక్కదారి పట్టించారు. కర్నూలు నగరపాలక సంస్థలో ఇంధనం వాడకం పేరుతో సుమారు రూ.లక్షలు జేబులో వేసుకున్నారు. గతంలో ఆదోని పురపాలక సంఘంలో నాసిరకం బ్లీచింగ్, మలాథియన్ ద్రావణం తెప్పించి.. అధిక మొత్తంలో బిల్లులు చేసి, సొమ్ము స్వాహా చేశారు. అన్ని పురాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఫాగింగ్ పేరుతో తిప్పే వాహనాలకు ఇంధనం కోసం బోగస్ బిల్లులు తయారుచేసి అక్రమాలకు పాల్పడుతున్న సంఘటనలున్నాయి. ఇప్పటికైనా స్పందించి నిధులు పక్కదారి పట్టకుండా దుర్వినియోగం చేయకుండా ప్రజల సంక్షేమం కోసం వెచ్చించి దోమల బెడద నుంచి వ్యాధుల నుండి ప్రజలు ఆసుపత్రుల పాలు కాకుండా దోమల పై ప్రత్యేక కార్యక్రమాలు, నివారణ చర్యలు చేపట్టాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు.

నంద్యాల బొమ్మలసత్రం, సెప్టెంబర్ 24
(రిపబ్లిక్ న్యూస్) సుధీర్

ఏడాది	డెంగీ కర్నూలు/నంద్యాల	మలేరియా కర్నూలు/నంద్యాల
2023	409/128	4/28
2024	168/24	2/0

రోడ్ల పై నిలిచి ఉన్న మురికి నీరు

రిపబ్లిక్ స్పోర్ట్స్

పీవీ సింధును మళ్లీ పోడియంపైకి తీసుకురావడమే నా గోల్: అనూప్ శ్రీధర్

భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు ఆటలో స్థిరత్వం తీసుకురావడంలో సహకరించడమే తన లక్ష్యమని అనూప్ శ్రీధర్ అన్నారు.

భారత స్టార్ షట్లర్ పి.వి. సింధుకు మాజీ ఆటగాడు అనూప్ శ్రీధర్ కొత్త కోచ్గా వ్యవహరించనున్నారని ఆమె తండ్రి పి.వి.రమణ వెల్లడించిన సంగతి తెలిసిందే. గచ్చిబౌలి స్టేడియంలో గత మూడు వారాలుగా శ్రీధర్ ఆధ్వర్యంలో ఆమె శిక్షణ పొందుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త కోచ్ మీడియాతో మాట్లాడుతూ.. పీవీ సింధును మళ్లీ పోడియంపైకి తీసుకురావడమే తన గోల్ అని వెల్లడించారు. ఆమెలో విజయం సాధించాలనే తపన ఉందని, ఆటలో స్థిరత్వం తీసుకురావడంలో సహకరించడమే తన లక్ష్యమని తెలిపారు. "కొన్ని వారాల క్రితం నేను సింధు బృందంతో మాట్లాడాను. ఈ నెల ప్రారంభం నుంచి హైదరాబాద్లో గచ్చిబౌలి స్టేడియంలో నా వద్ద శిక్షణ పొందుతోంది. మాకు పురోగతి కనిపించింది. రెండు వారాల్లో ఐరోపాలో జరగనున్న టోర్నమెంట్లకు వెళ్లనున్నాం. మేం దీర్ఘకాలిక ఒప్పందంలో లేకపోవడంతో.. 2025 కోసం ప్లాన్ చేయడం కష్టం. ఏడాది జరగనున్న టోర్నమెంట్లలో మెరుగైన ప్రదర్శన చేయాలని ఆమె లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఆటలో స్థిరత్వం తీసుకురావడంపైనే ప్రధానంగా దృష్టిసారించాను. ఈ మూడు వారాల్లో పురోగతి కనిపించింది. కానీ, చేయాల్సింది చాలా ఉంది" అని ఆయన మీడియాకు వెల్లడించారు. త్వరలో ఫిన్లాండ్లో జరిగే ఆర్కిటిక్ ఓపెన్తో సింధుతో అనూప్ పని చేయబోతున్నారని సింధు తండ్రి వెల్లడించారు. "బెంగళూరులో ఇక సింధు శిక్షణ కొనసాగించదు. హైదరాబాద్లో ట్రైనింగ్లో పాల్గొంటుంది. ప్రస్తుత కోచ్ ఆగస్ సాంటసోతో ఒప్పందం ముగియనుండటంతో.. ఫిన్లాండ్లో జరిగే టోర్నీ వరకు సింధుకు కోచ్గా అనూప్ శ్రీధర్ వ్యవహరిస్తారు. గతంలో పని చేసిన కొరియా కోచ్ పార్క్ సంగ్ పేరు కూడా పరిగణనలోకి వచ్చినా, అతడిని కొనసాగించడం వల్ల సానుకూల ఫలితాలు రావట్లేదని భావించాం" అని రమణ పేర్కొన్నారు. 2016 రియో ఒలింపిక్స్లో రజతం సాధించిన ఈ స్టార్.. 2020 టోక్యో క్రీడల్లో కాంస్యం నెగ్గింది. 2024 భారత పారిస్ క్రీడల్లో మాత్రం క్వార్టర్స్‌లోనే వెనుదిరిగింది.

ఫిట్‌నెస్

ఏరోబిక్స్ చేస్తే గుండె సమస్యలు రావా

ఎక్సర్‌సైజెస్‌లో ఏరోబిక్స్ కూడా ఒకటి. ఈ వర్కౌట్స్ చేయడం వల్ల చాలా లాభాలు ఉన్నాయి. అవేంటో తెలుసుకోండి.

ఏరోబిక్స్.. అనేవి బెస్ట్ వర్కౌట్స్. ఇందులో వాకింగ్, జాగింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్ వంటి మజిల్ వర్కౌట్స్ చేయడం వల్ల కేలరీలని బర్న్ చేయొచ్చు. దీంతో పాటు బ్లడ్ ఫ్లో సరిగ్గా అవుతుంది. దీనిని చేయడం వల్ల గుండెకి చాలా మంచిది. ఏరోబిక్స్ చేయడం వల్ల గుండె ఆరోగ్యం బాగుంటుంది. దీంతో పాటు చాలా లాభాలు ఉన్నాయి. పూర్తి వివరాలు ఏంటో తెలుసుకోండి.

ఇమ్యూనిటీ..

ఏరోబిక్ చేయడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది. దీని వల్ల సీజనల్ సమస్యలు దూరమవుతాయి. రెగ్యులర్‌గా చేయడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది.

బోన్, మజిల్ స్ట్రెంథ్..

ఏరోబిక్స్ చేయడం వల్ల బోన్ హెల్త్ బాగుంటుంది. మజిల్స్ బలం, ఫ్లెక్సిబిలిటీ పెరుగుతుంది. అందుకే, వయసు పెరిగే కొద్దీ వచ్చే సమస్యల్ని దూరం చేసేందుకు ఏరోబిక్స్ చేయండి.

మెంటల్ హెల్త్..

ఏరోబిక్స్ చేస్తే ఆందోళన, నిరాశ తగ్గుతుంది. మానసిక ఆరోగ్యం బాగుంటుంది. మరీ ముఖ్యంగా వాకింగ్ పచ్చని చెట్ల మధ్య చేస్తే మరీ మంచిది.

వెయిట్ మేనేజ్‌మెంట్..

ఏరోబిక్స్ చేయడం వల్ల బరువు తగ్గుతారు. ఇవి చేయడం వల్ల సరైన బరువుని మెంటెయిన్ చేయొచ్చు. కేవలం ఏరోబిక్స్ చేయడం వల్ల బరువు తగ్గరు. దీంతో పాటు హెల్దీ డైట్ మెంటెయిన్ చేయాలి.

కార్డియోవాస్కులర్ హెల్త్..

ఏరోబిక్ ఎక్సర్‌సైజెస్ చేయడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. దీని వల్ల కరోనరీ ఆర్టరీ వ్యాధి తగ్గుతుంది. రక్తపోటు తగ్గుతుంది. స్ట్రోక్ ప్రమాదం కూడా తగ్గుతుంది. రెగ్యులర్‌గా చేయడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది.

బ్యాలెన్సింగ్..

ఏరోబిక్స్ చేయడం వల్ల మీ బాడీ బ్యాలెన్స్ పెరుగుతుంది. దీంతో పాటు పోశ్చర్ పెరుగుతుంది. ఏరోబిక్ వర్కౌట్ మృదుత్వాన్ని పెంచుతుంది. వాకింగ్, జాగింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్, కార్డియో ఎక్విప్ మెంట్ వాడి చేయడం బెస్ట్ ఏరోబిక్స్. గమనిక : ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్‌ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.